
కథ

పల్లెలు బోసిపోతున్నాయి. కులవృత్తులు ధ్వంసమవుతున్నాయి. చిన్నాచితకా వ్యాపారాలను కార్పొరేట్ సంస్కృతి కబళిస్తోంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో పల్లె జ్ఞాపకాలను వెతుక్కుంటున్న ఓ రచయిత ఆవేదన

# గాయపడిన కోయిల

దొరైరాజ్



రెండు రకాల భావాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒకటి సంతోషకరమైనది. రెండవది కొద్దిగా బాధపడవలసింది. శ్రీకాళహస్తికి వచ్చాక సీనియర్ పొజిషన్స్ ఇంటర్వ్యూలు ఆర్గనైజ్ చేయడానికి చెన్నై వెళ్లవలసి రావడం మంచి అవకాశం. ఇక రెండవది అనుకోకుండా ఆఫీసు పనిగా మదనపల్లికి వెళ్లవలసి రావడం. రెండూ ముఖ్యమైన పనులే. నా అవసరం వున్న పనులే. ఎక్కడికి వెళ్లాలో నిర్ణయం తీసుకోవాలి. ఈ భావాలకు మూలం అక్కడే వుంది. కొంత ఆలోచించాక మదనపల్లికి వెళ్లడానికే నిర్ణయించుకున్నాను.

మదనపల్లి అంటే వెంటనే గుర్తుకొచ్చేది నాలో పెను మార్పులకు కారణమైన సిటిఎం. ఆ ఊరితో నా అనుబంధం అక్కడి అనుభవాలు. మా ఊళ్లో నా చదువు సవ్యంగా సాగడం లేదని పదవ తరగతి చదవడానికి మా చిన్నాన్న దగ్గరకు పంపారు మా నాన్న. టెన్త్ పూర్తయ్యాక కేవలం ఒకటి, రెండు సార్లు సిటిఎం వెళ్లగలిగాను. మా చిన్నాన్న రిటైరయి చిత్తూరులో సెటిలవడం, ఉద్యోగపరంగా నేను పలుచోట్ల తిరగడంతో దాదాపు 20 సంవత్సరా లైంది, సిటిఎం వెళ్లి.

శ్రీకాళహస్తి నుంచి మదనపల్లి వెళ్లాలంటే సిటిఎం మీదుగా వెళ్లాలి. అందుకే మదనపల్లి వెళ్లడా నికే నిర్ణయించుకున్నా. సిటిఎంలో నేనున్న సంవ త్సరం రోజులు ఎన్నో మధురానుభూతుల సంగమం.

నా క్లాస్‌మేట్ జానకి మంచి బ్రిలియంట్! అబ్బాయిల్లో లక్ష్మీపతికి చదువుల్లో గట్టిపోటీ. మేం అబ్బాయిలూ, అమ్మాయిలూ సమాన నిష్పత్తిలో వుండి చదువుతోపాటు ఇతర విషయాలలోనూ చురుగ్గా వుండేవాళ్లం. అక్షరక్రమంలో నా తరువాత నెంబరు జానకిది. పరీక్షల్లో ముందూ, వెనుకా కూర్చునే వాళ్లం. నాకొచ్చే డౌట్స్ ఆమె క్లియర్ చేసే ది.

ఊరికానుకుని అప్పగారి భూములుండేవి. అప్పగారంటే ఆ ఊరి కరణం. ఆ భూముల కావల శివాలయం వుండేది. భూములు వరి, చెరకు లాంటి పంటలతో ఎప్పుడూ కళకళలాడుతుండేవి. వరి పంట కోతకొచ్చినప్పుడు, చెరకు పూత పూసినప్పుడు, పసుపు నూరి ఆరబోసినట్లు పచ్చగా అందంగా వుండేది. సాయంత్రాలు ఫ్రెష్ అయి మా పిన్ని ఇచ్చే చిరుతిండ్లు తింటూ నేనూ, జానకి, మోహన్‌లు శివాలయం వెళ్లే వాళ్లం. ఈ స్నేహం నా పేరు, జానకి పేరు స్కూల్ గోడల మీదకి, క్లాస్‌రూం బోర్డు మీదకి చేరేందుకు దారితీసింది.

ఒక రోజు ఉదయం వాచ్‌మెన్ వెంకటరమణ క్లాస్‌రూం క్లీన్ చేస్తున్నప్పుడు పై సీను కనిపించిందట. వెంటనే ఈ విషయం మా చిన్నాన్న చెవికి చేరవేశాడు. వాళ్లంతా నా మీద జోక్స్ వేసుకుంటున్నారు. అందరూ నన్ను కొత్త కోణంలో చూస్తున్నారు. అలా ఎందుకు చూస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. మాక్లాస్‌మేట్స్ బోర్డు చుట్టూ మూగి గుసగుసలాడుకుంటున్నా వారల్లా నన్ను చూసి సైలెంట్ అయిపోయి వివిపికి రెడ్ కార్పెట్ వెల్కం ఇచ్చినట్లు దారి వదిలారు. బోర్డు మీద నా పేరు, జానకి పేరు, మధ్యలో ఒక లవ్ సింబల్... కొన్ని కొటేషన్లూ.. విషయం అర్థం అయ్యాక నాకు ఏడుపు ఆగలేదు. జానకి అప్పుడే క్లాసుకు వచ్చింది. ఆమెకు కాస్త ధైర్యం ఎక్కువ, నన్ను ఓదార్చడం మొదలుపెట్టింది. ఈ సీన్ చూసి ఒకటే చప్పట్లు, కామెంట్లూ, ఈలలూ... నవ్వులే నవ్వులు. వారం రోజుల పాటు స్కూల్లో మేమే డిస్కషన్ పాయింట్. అప్పట్లో వాళ్ల ఫీలింగ్స్ చూసి ఏమిటో ఈ పిచ్చోళ్లు అనుకునేవాణ్ణి. ఆ తరువాత్తరువాత ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా నాకు నవ్వాగేదిగాదు. అన్నట్లు.. జానకి ఇప్పుడెలా వుందో... నా ఆలోచనలకు నాకే నవ్వొచ్చింది.

మా ముగ్గురితో పాటు మరో ఐదారుగురం మిల్లు పోస్టుమాస్టరు రమణగారి దగ్గర ట్యూషన్‌కు వెళ్లేవాళ్లం. పరీక్షలు దగ్గర పడేసరికి అక్కడే నైట్ హాల్ట్ వుండి చదువుకునే వాళ్లం. అదో వింత ప్రపంచం. పక్కనే అప్పగారి బంగ్లా. వారి పిల్లలు మదనపల్లిలో చదివేవాళ్లు. వాళ్లతో మాట్లాడాలంటే బెరుకు బెరుకుగా వుండేది. వాళ్లు సాయంత్రాలు పొలం వైపు వెళుతుంటే అలా గుడ్లప్పగించి చూస్తూ వుండేవాళ్లం. మాతో పాటు జ్ఞాన ప్రసూనాంబ, రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మరో ఇద్దరు అమ్మాయిలు చాలా చలాకీగా వుండేవారు.

గతానుభవాలు మనసులో మెదిలి అద్వితీయమైన మధురానుభవాల అనుభూతి కెరటం మనసును తాకింది.

తరచూ మేము కిష్టప్ప కొట్టుకు వెళ్లి కావలసిన చిరుతిళ్లు మా చిన్నాన్న అకౌంట్‌లో తీసుకునేవాళ్లం. కిష్టప్ప నల్లగా తుమ్మ మొద్దులా వుండేవాడు. తెల్లటి ఖద్దరు బట్టలు వేసుకొని కొట్టు ముందు కుర్చీలో కూచుని పల్లెల నుంచి వచ్చే కష్టమర్లతో వరసలు కలిపి సరదాగా నవ్వుతూ నవ్విస్తూ కళకళలాడు తుండేవాడు. వాళ్లబ్బాయిలతో కలిసి మేము చాలా సార్లు వాళ్ల నూనె మిల్లుకు, ఆ వెనుక వున్న కొండమీదకి వెళ్లేవాళ్లం. అక్కడ చింతచెట్టు కాయలు మధ్యలో ఎర్రగా వుండి తినేందుకు చాలా బాగుండేవి. ఆలోచనలతో అప్రయత్నంగా నోట్లో నీళ్లూరాయి.

సిటిఎంలో అశ్వత్ హోటలు తెలియని వారు లేరు. మసాలా దోశె చాలా పాపులర్ టిఫిన్.


ఆదివారాలు శేషాద్రి సారూ, వాచ్‌మెన్ వెంకటరమణ, బొమ్మ నారాయణ తాత, శానిటోరియం నుండి హెల్త్ ఇన్‌స్పెక్టరూ, డాక్టరూ వచ్చి మా చిన్నాన్నతో కలిసి కూచునేవారు. ఒక్కొక్కరూ ఒక్కో విషయంలో గొప్పవాళ్లు. ఆ మాటలు నేనూ వినేవాణ్ణి. అదో గొప్ప ఎడ్యుకేషన్.

బొమ్మనారాయణ తాతయితే సందర్భం వచ్చినపుడల్లా "ఏమప్పా, మీ ఊర్లో నువ్వు సరిగా చదవడం లేదని మీ నాయన నిన్ను ఇక్కడికి పంపించినాడు. నువ్వు బాగా చదివి పది పాసై మా పిళ్లె మాస్టారుకు, మా బడికి మంచి పేరు తేవాలి." అనేవాడు. మా చిన్నాన్న నన్ను చూసి నవ్వి ఊరుకునేవాడు.

"సార్! మదనపల్లి వచ్చేశాం! ఎక్కడకి వెళ్లాలి" డ్రైవర్ అడిగేసరికి మధురానుభూతులకు గట్టి బ్రేక్ పడింది. ఒక్కసారి గుండె వేగం పెరిగింది. ముందు ఆఫీసు పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో సిటిఎం వెళ్లవచ్చని కారు కోర్టు వైపుకు మళ్లించా!

తిరుగు ప్రయాణమయ్యా. శానిటోరియం దాటాను. ఒకటే ఆత్రుత. ఏదో తెలియని అనుభూతులు నాతో పాటే వస్తున్నాయి. అలా అలా స్పిన్నింగ్ మిల్లు, క్రాస్‌రోడ్స్, రైల్వేట్రాక్ దాటాను. కారు ఎడమ వైపుకి తిప్పి ఊళ్లోకి వెళ్లమన్నాను. ఉర్దూ స్కూల్ దాటి దర్గ మెట్ట మీదుగా నరశింహస్వామి గుడి దగర తేరు దాటి వంపు తిరిగింది కారు. తెలిసిన వాళ్లెవరు కనిపించడం లేదు. అల్లంత దూరాన నేను చదివిన స్కూల్ పై కప్పు ఎగిరి పూర్తిగా శిథిలమై కనిపిస్తోంది. దగ్గరకి వెళ్లా. ఆ స్కూలు ఆవరణలో చేద బావి వుండేది. అది ఆ వీధి వాళ్లందరికి తాగునీరు సరఫరా కేంద్రం. పెద్ద చాంతాడుకు బకెట్ కట్టి బావి నుండి నీళ్లు తోడుకునేవారు. ఉదయం, సాయంత్రాలు అక్కడ ఒకటే సందడి. ఊరి కథలన్నీ అక్కడే వుండేవి.

కుడివైపు చింతతోపు వుండేది. చింతచెట్లపై కోతి కొమ్మచ్చి, కర్రాబిళ్లా, గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుకునేవాళ్లం. మా స్కూల్ సాంస్కృతిక కార్యక్రమాలకు అదే వేదిక. ఇప్పుడు ఒక్క చెట్టూ లేదు. స్కూల్ గురించి అక్కడ ఆడుకుంటున్న పిల్లలను అడిగా. వాళ్లు నన్నో పిచ్చివాడిలా చూశారు. వాళ్ల మాటల వల్ల మదనపల్లె రోడ్డులో చెరువుకు ఆవల వున్న దాన్ని స్కూల్ అంటారని, దీన్ని బూత్ బంగ్లా అంటారని తెలుసుకోగలిగాను. పైకి చూశా. ఒకప్పటి హయ్యర్ క్లాసెస్ గదులు వైభవం కోల్పోయిన కోటలా మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. మనసు కకావికలమై ప్రశాంతత కోసం శివాలయం వెళదామని అటువైపు దారి మళ్లా. స్కూలు అనుకుని వున్న దారిలో శివాలయం వెళ్లాలి. ఆ పక్కనే ఒకప్పుడు మేము కాపురం వున్న ఇల్లు. ఇప్పుడు అక్కడ పశువులను కట్టేశారు. ఎన్నో చల్లని సాయంత్రాలు అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్లం. కారు ఒక్క కుదుపుతో ఆగింది. అక్కడో మందు షాపు వెలి




సింది. దానికి అనుబంధంగా చిన్న టిఫిను బండ్లు వున్నాయి. చుట్టూ గుమిగూడిన జనం మత్తుగా ఈ లోకంతో సంబంధం లేనట్లు తూలిపడుతున్నారు. దూరంగా శివాలయం. అప్పటి పచ్చదనం అలాగే వుంది. థాంక్ గాడ్! అనుకున్నా. అప్పట్లో ఈ దారి విశాలంగా వుండేది. ఇక శివాలయం వెళ్లాలనే ప్రయత్నం మానుకొని మోహన్ వాళ్లింటికి వెళ్లా. మోహన్ మదనపల్లిలో ఏదో స్కూల్‌లో పనిచేస్తున్నాడని, కాస్త ఆలస్యంగా వస్తాడని, జానకికి పెళ్లయి తిరుమలలో సెటిలయ్యిందని తెలుసుకున్నా. మనసు బరువెక్కగా కారు భారంగా నడుస్తోంది. అప్రయత్నంగా అటు చూశా. వెలవెలబోతున్న కోమటి బజారు. ఒకప్పుడు ఈ సమయంలో సరుకులు బేరం చేసుకునే రైతుకూలీలలతో షాపులు, బొరుగుల బుట్టలూ, టిఫిను బళ్ళూ కళకళలాడుతుండేవి. ఏరకమైన భేషజాలు లేకుండా అందరూ సంతోషంగా వుండేవారు. అక్కడి నుంచి బజారులో అప్పగారింటి వరకు వెళ్లాలనిపించి మూడు, నాలుగు షాపులు దాటాక కాళ్లు అప్రయత్నంగా ఆగాయి. ఆ షాపు దగ్గర నల్లటి మొద్దులాంటి వ్యక్తి ముడుతలు పడిన చర్మం, జుట్టంతా రాలిపోయి బండరాతి పై కూర్చుని శరీరాన్ని బరబరా గీకేసుకుంటున్నాడు. ఒంటిపై ఒక తుండు బట్టా, తెల్లటి పంచె తప్పించి మరే ఆచ్ఛాదనా లేదు. నిర్లిప్తమైన చూపు పరిశీలనగా చూస్తే అతను కిష్టప్ప అని అర్థమైంది. నన్ను అతను గుర్తుపట్టలేదు. పాండు గురించి అడిగా. పైకి, కిందికి చూసి మద్రాసెల్లిపోయాడు అంటూ ఏ రకమైన ఫీలింగ్స్ లేకుండా తన పనిలో నిమగ్నమైపోయాడు. నన్ను నేను పరిచయం చేసుకుని కొన్ని సంఘటనలు గుర్తు చేశాక అతనిలో ఏమూలలో దాగిన దుఃఖం కట్టలు తెంచుకొని బావురుమన్నాడు. నేను ఓదార్చే ప్రయత్నం చేయలేదు. అలా ఏడ్చి ఏడ్చి అలసిపోయి కొంతసేపయ్యాక మామూలయ్యాడు.

అక్కడో కారు ఆగడం. నేను బజారులోకి రావడం అ సీన్ చూసిన జనం గుమిగూడారు. అందరూ గమనించేవారే. ఒక్కరూ మాట్లాడడం లేదు. ఆ గుంపులో ఒకరిద్దరిని నేను గుర్తుపట్ట గలిగాను. నన్ను నేను పరిచయం చేసుకునేవరకూ నన్నెవరూ గుర్తుపట్టలేదు. అంతలో మోహన్ అక్కడికి వచ్చాడు. పెద్ద శ్రమ లేకుండా ఒకరినొకరం గుర్తుపట్టగలిగాం. క్షేమ సమాచారాలు, ఇతర సంగతులూ మాట్లాడుకుంటూ అలా మోహన్ వాళ్లింటికి వచ్చాం. మోహన్‌లో చాలా మార్పులొచ్చాయి. మాట తీరు, భావాలలో స్పష్టత, ఆవేశం, విషయ పరిజ్ఞానం. ఇలా అన్నింట్లోనూ ఎంతో పరిపక్వత కనిపిస్తోంది. మాటల్లోనే మాక్లాస్‌మేట్స్ ఎవరెలా వున్నదీ చెప్పుకొస్తున్నాడు. అలా సబ్జెక్టు కిష్టప్ప వైపు మళ్లింది.

పల్లెల నుండీ ఎవరూ ఇక్కడ బేరాలు చేసుకోవడం లేదనీ, బతుకులు భారమైపోయి కొంత మంది రైతులు కూలీలుగా మారిపోయారని, మెరుగ్గా వున్న కొందరు మదనపల్లిలోని మాల్స్‌లో కొనుగోలు చేసుకుంటున్నారనీ చెప్పాడు. బజారులో కిష్టప్ప ఒక్కడే కాదు చాలా షాపుల పరిస్థితి విషమంగా వుంది. కొందరు పూర్తిగా మూసేసి చిన్నా చితకా పనులు చేసుకొని బతుకుతున్నారని చెప్పాడు.

''రాజు మన క్లాస్‌మేట్స్‌లో మన వయసు వాళ్లెవరూ ఊర్లో లేరు. నాలాంటి కొంత మంది తప్ప. చాలా మంది చెన్నై, బెంగుళూరుల్లో సెటిలైపోతున్నారు. వాళ్లు సంపాదనా, పెట్టుబడి, జీవితం అంతా అక్కడే. ఈ పల్లెలో ఏముంది. అందుకే రోజు రోజుకూ పల్లె తరిగిపోతుంది. దీని గురించి ఆలోచించే అవసరం, సమయం ఎవరికుంది? ప్రశ్నించాడు.




''తప్పేముంది మోహన్? దిసీజ్ ది ఆర్డరాఫ్ దడే. జీవితం పల్లెల కంటే టౌన్‌లలోనూ, సిటీల్లోనూ మెరుగ్గా వుంది. వలసలు తప్పుకాదు. చిన్నా చితకా ఉద్యోగాలు, పనులు పట్టణాలలో చేసుకుంటున్నారు. మనకు కావలసిన అన్ని వస్తువులూ నాణ్యత కలిగి, చౌకగా మాల్స్‌లో దొరుకుతున్నాయి. మన రైతులూ బెనిఫిట్ పొందుతున్నారు కదా! వినియోగదారులుగా నువ్వూ, నేనూ, మనమంతా బెన్‌ఫిట్ పొందుతున్నాం. రెండు వర్గాల ప్రజలూ లబ్ధి పొందుతున్నారు. నిజంగా ఇది ప్రపంచీకరణ మనకిచ్చిన వరంగా నేను భావిస్తున్నాను. ఆఫ్‌కోర్స్ ఇది నా వ్యక్తిగత అభిప్రాయమనుకో...''

మోహన్ అసహనంగా చూసి నా మాటలకు అడ్డు తగిలాడు.

''నువ్వు కార్పొరేట్‌లో పనిచేస్తున్నావు గదా! అలాగే మాట్లాడుతావు. నువ్వంటున్న ఈ ప్రపంచీకరణ పుణ్యమా అని పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు బుట్టలెత్తుని వీధుల్లో కూరలమ్మే అవ్వలతోనూ, సైకిల్‌పై పాలమ్ముకునే వాళ్లతోనూ పోటీపడుతున్నారు. చిన్న టౌన్‌లు, పల్లెల్లో కిరాణా షాపు పెట్టుకొని జీవనం సాగించే కిష్టప్ప లాంటి బడుగు జీవులపై పోటీ పడేందుకు షాపింగ్ మాల్స్, రీటైల్ స్టోర్స్‌పై కోట్లు కుమ్మరిస్తున్నారు. ఉప్పు, పప్పు లాంటి నిత్యావసర వస్తువుల ధరలు సాధారణ వ్యక్తికి అందనంత ఎత్తుకు తీసుకెళుతున్నారు. నువ్వన్నట్లు వినియోగదారునికి సరసమైన ధరలో నాణ్యమైన వస్తువు అందిస్తారు. అయితే ఇది ఎంతకాలం? చిల్లర వ్యాపారం పూర్తిగా దెబ్బతినేవరకూ. ఈ మాయ మాటలు, ముసుగు వేషాలు. ఒకసారి అదే జరిగితే ఈ సూటు,బూటు వేసుకుని కూరలమ్మే సూపర్ మార్కెట్ వాలాలు నిర్ణయించిన ధరలు మనం చెల్లించక తప్పదు. వీళ్ల విదేశీ పాలను, విదేశీ నీళ్లను కలిపి మనకు అమ్మగలరు. గ్రేడెడ్ ఉప్పు, గ్రేడెడ్ కోడిగుడ్డూ మన రైతులకు రుచి చూపిస్తారు. విదేశీ రైతులతో మన రైతులు పోటీ పడగలరా? మన రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సాంకేతిక సహకారం ఎంత చేరుతోంది? దీనివల్ల రైతులు నష్టపోరా! చిన్న పరిశ్రమలు మూతపడవా? ఈ సామాజిక పరిణామం మానవ సంబంధాలపై ఎంతటి ప్రభావాన్ని చూపుతుంది? ఊహించడానికే భయంగా లేదా? ఈ సమస్యలను ఎంత మంది అర్థం చేసుకుంటున్నారు? దీనిపై కదలిక ఎప్పుడొస్తుంది? ఏ వర్గం నుంచి వస్తుంది? ప్రజల నుంచా? మేథావుల నుంచా? రాజకీయ నాయకుల నుండా?''

''కిరాణాల పైనా, కూరగాయల బండ్ల పైనా ఆధారపడి బతికే కిష్టయ్య లాంటి లక్షలాది మంది జీవితాలు ఏమైపోతాయి. మన దేశంలో దాదాపుగా ఎనభై శాతం మంది పల్లెవాసులేనని లెక్కలు చెపుతున్నాయి. తొంభై శాతం నిత్యావసర వస్తువుల వ్యాపారం అసంఘటిత రంగంలోనే వుంది. చిల్లర అంగళ్లు, కిరాణా కొట్లే నేటికీ... కొన్ని సామాజిక వర్గాల వారికి, సాంప్రదాయక వృత్తిగానే కొనసాగుతున్నాయి కదా...''

మోహన్ వాగ్ధాటి ఆగలేదు. అవును అతనన్నవన్నీ నిజాలే. నా చుట్టూ చీకటి ఆవహించి శరీరమంతా చిరు చెమటలు పోశాయి. పెద్ద సూటేసుకున్న కార్పొరేట్ చేపలు కిష్టయ్యలాంటి నలుసుల్ని ఏరకమైన ఆక్షేపణా లేకుండా నిర్దాక్షిణ్యంగా మింగేస్తున్నాయి.. అతని మాటలతో మనసు కకావికలమైంది. కారెక్కాను. మోహన్ మరింత ఆవేశంగా మాట్లాడుతున్నాడు. ఆ ఆవేశం, ఆక్రోశం, ఆవేదనా దుఃఖంగా రూపాంతరం చెందుతున్నట్లు ఆకాశంలో కమ్ముకున్న నల్లని మబ్బులు, మబ్బుల మధ్య మెరుపులూ... ఎక్కడో దూరంగా ఉరుము ఉరిమిన శబ్దం. సన్నటి చినుకులు మొదలయ్యాయి. ఈ చినుకులు ఎక్కడ పెనుతుఫానుగా మారుతుందోనన్న భయం. ఇక్కడ నుంచి ఎంత త్వరగా వెళితే అంత మంచిదనుకొని ఊరుదాటాను. చినుకులు ఆగాయి. బహుశా వర్షం పెద్దది కాకపోవచ్చు. ప్రళయం రాకపోవచ్చు. అంతా నాభ్రమ. బహుశా చెన్నైకి వెళ్లకుండా మదనపల్లికి రావాలనుకున్న నా నిర్ణయం సరైనది కాదేమో...

★